ఘనంగా అయ్యప్ప ఆలయ శంకుస్థాపన



అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో స్వామి అయ్యప్ప గుడి నిర్మాణానికి గ్రామపెద్దలు ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు కోటి రూపాయల ఖర్చుతో నిర్మాణం చేసే ఆలయానికి గ్రామస్తుల నుంచి విరాళాలు సేకరించి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని రూ. 50 లక్షల విలువ చేసి భూమి సుమారు 13 సెంట్లు ఉచితంగా ఇచ్చినట్టు చెప్పారు. గ్రామానికి చెందిన పినపోత్రుని దొరయ్య, నూకరాజు, కొండ, తాతీయ్య కుటుంబ సభ్యులు స్థలాన్ని ఇచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ బొలిశెట్టి గోవిందరావు, శ్రీనివాసరావు, కొణతాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ కొణతాల ఉమాదేవి, కుర్రా కాశి, సత్తిబాబు పాల్గొన్నారు.

'జన'మంచిలి



కన్నబాబుతో కలిసి ర్యాలీలో పాల్గొన్న బూడి ముత్యాల నాయుడు,ఎంపీ సత్యవతి,బొడ్డేడ ప్రసాద్

- వేలాది మందితో పట్టణంలో భారీ ర్యాలీ
- నామినేషన్ వేసిన యలమంచిలి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రమణమూర్తి రాజు(కన్నబాబు)
- అడుగడుగునా ప్రజలు, పార్టీ శ్రేణుల నీరాజనాలు
- కళాకారుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య తరలిన పార్టీ శ్రేణులు



ఎమ్మెల్యే కన్నబాబు నామినేషన్ సందర్భంగా పార్టీ శ్రేణులతో కిక్కిరిసిన యలమంచిలి ప్రధాన రహదారి



కొండంత అభిమానంతో ర్యాలీలో పాల్గొన్న దివ్యాంగుడు నాయుడు

యలమంచిలి రూరల్ : ఎటు చూసినా ఉప్పెనలా తరలివచ్చిన జనం..జై జగన్..జై కన్నబాబు..జై బూడి..అంటూ నినాదాలతో వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో యలమంచిలి పట్టణ వీధులు శుక్రవారం కిక్కిరిసిపోయాయి. కళాకారుల ఆటపాటలు, డప్పుచప్పుళ్లతో తరలిరాగా మహిళలు అధికసంఖ్యలో వచ్చి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు (కన్నబాబు)కు ఘన స్వాగతం పలికారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కన్నబాబు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కన్నబాబురాజు వెంట అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి , వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొన్నారు.

అట్టహాసంగా నామినేషన్

యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు), వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. తన కుమారుడు సుకుమారవర్మతో కలిసి ఎమ్మెల్యే కన్నబాబు శుక్రవారం నేరుగా ఎస్.రాయవరం మండలం దార్లపూడి షుగర్ ఫ్యాక్టరీ కాలనీ సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యలమంచిలి మండలం ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత యలమంచిలి గాంధీనగర్ పార్టీ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే కన్నబాబు, పార్టీ నాయకులు, అభిమానుల జనసందోహం మధ్య ర్యాలీ ప్రారంభించారు. మహిళల కోలాటం, డప్పుమోతలు, యువకుల నృత్యాలు, కళాకారుల ఆటపాటలు, డీజే పాటలతో ర్యాలీ విజయోత్సవ ర్యాలీని తలపించింది. రహదారులన్నీ అశేష జనవాహినితో కిక్కిరిసిపోయాయి.

నాలుగు సెట్ల నామినేషన్ల దాఖలు

ర్యాలీ అనంతరం ఆర్వో కార్యాలయంలోకి వెళ్లిన ఎమ్మెల్యే కన్నబాబురాజు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం, అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, రంగా సాయి, బొద్దపు ఎర్రయ్యదొర, రాజాన మహాలక్ష్మి తదితరులు వెళ్లారు.

నాకు పోటీలేదు...నాలుగోసారి గెలుస్తా..

మండుటెండను సైతం లెక్కచేయకుండా పార్టీపై, తనపై ఉన్న అభిమానంతో వేలాదిగా తరలివచ్చిన జనాన్ని చూస్తుంటే నాకు పోటీయే లేదనిపిస్తోందని, నాలుగోసారి తప్పకుండా విజయం సాధిస్తానన్న నమ్మకం పెరిగిందని, యలమంచిలి ప్రజల ఆశీర్వాదం నాకే ఉందని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. మే13 న జరిగే పోలింగ్‌లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా బూడి ముత్యాలనాయుడికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ర్యాలీ అనంతరం దిమిలి రోడ్డు కూడలి వద్ద తనకు మద్దతుగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే కన్నబాబు,ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో మరోసారి సుపరిపాలన కావాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం మేం సిద్ధం..మీరంతా సిద్ధమా..అని నినాదాలు చేయించి అందరినీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్,వైస్ ఎంపీపీ రాజాన శేషు, దూది నర్సింహమూర్తి, అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, సేనాపతి రాము, గొట్టుముక్కల శ్రీనుబాబు, పిన్నమరాజు కిషోర్ రాజు, రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్రావు, అచ్యుతాపురం, మునగపాక జెడ్పీటీసీలు లాలం రాము, సోము, మునగపాక ఎంపీపీ లక్ష్మి, అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం



అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది

యలమంచిలి : అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపకశాఖాధికారి డి.రాంబాబు అన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు భద్రతా పరంగా ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలో యలమంచిలి ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినపుడు మంటలను ఏ విధంగా అదుపు చేయాలో, వాటి నుంచి రోగులను ఏవిధంగా రక్షించాలో ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ప్రభుత్వాసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యలమంచిలి సీహెచ్ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం బస్సు యాత్రను విజయవంతం చేయాలి



ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి : మేము సిద్ధం యాత్రలో భాగంగా శనివారం అనకాపల్లి జిల్లా గొడిచర్ల నుంచి ప్రారంభం కానున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహరెడ్డి బస్సు యాత్రను విజయవంతం చేయాలని పాయకరావుపేట సమన్వయకర్త రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు గొడిచర్ల నుంచి జగనన్న బస్‌యాత్ర ప్రారంభమవుతుందన్నారు. యాత్ర ప్రారంభానికి స్వాగతం పలికేందుకు గొడిచర్ల జంక్షన్‌కి పాయకరావుపేట పరిసర ప్రాంతాల ప్రజలు తరలిరావాలన్నారు. అక్కడ నుంచి బస్సు యాత్ర ఉద్దండపురం, వేంపాడు, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి చేరుకుంటుందన్నారు. అక్కడ రోడ్ షో అనంతరం అడ్డురోడ్డు చేరుకుని ఎస్.రాయవరం మండల వాసులను సీఎం పలకరిస్తూ ముందుకు సాగుతారన్నారు. ఈ మేరకు కోటవురట్ల మండలం, ఎస్.రాయవరం మండలాలకు చెందిన వారు అడ్డురోడ్డు చేరుకుని బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

వడగాడ్పులకు అల్లాడిన జనం



నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక:ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వడగాడ్పులు వీయడంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత కారణంగా బయటకు వచ్చేందుకు ఆందోళన చెందుతున్నారు. రైతులు తమ పొలం పనులు వేగవంతం చేసుకొని 11 గంటలకు ఇంటి ముఖం పడుతున్నారు. అలాగే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు తగు జాగ్రత్తలు తీసుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మరో నాలుగు రోజుల వరకు ఎండల తీవ్రత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఘనంగా రథోత్సవం



మునగపాకలో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



కోలాటం ఆడుతున్న కళాకారులు

మునగపాక : మునగపాక మండలంలో పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా రథోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మునగపాక పంచాయతీ వీధిలోని రామాలయం అలాగే గౌరీపరమేశ్వరుల ఆలయం రామాలయం వద్ద ,అరబుపాలెంలోనూ రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అలాగే గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

రూ.60 కోట్ల ఆస్తి పరుడు.. కానీ కారు లేదు..

- అనకాపల్లి జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ నామినేషన్
- రూ.60.18 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడి
- అతని వారసుల పేరు మీద మరో రూ.3.77 కోట్ల ఆస్తులు

విశాఖ సిటీ: అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ రూ.60 కోట్ల ఆస్తిపరుడు. కానీ కారు లేదట. అతని వారసుల ఇద్దరి పేరు మీద మరో రూ.3,77,05,133 స్థిర, చరాస్తులు ఉన్నాయి. వారికి కూడా ఎటువంటి వాహనం లేదు. ఈ మేరకు కొణతాల శుక్రవారం దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను పొందుపర్చారు. కొణతాల స్థిరాస్తులు రూ.58,97,53,200 కాగా.. చరాస్తులు రూ.1,20,77,938గా అందులో పేర్కొన్నారు. మొత్తంగా రూ.60,18,31,138 ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో వారసత్వ ఆస్తిగా రూ.2,34,88,200 మాత్రమే కాగా.. మిగిలిన మొత్తం తన సంపాదనగా చూపించారు. ఆస్తులే గానీ ఎటువంటి అప్పులు గానీ, రుణాలు గాని లేవు. అఫిడవిట్‌లో ఆస్తుల వివరాల ప్రకారం..

- కొణతాల వద్ద ప్రస్తుతం రూ.69 వేల నగదు మాత్రమే ఉంది.
- 5 బ్యాంకుల్లో రూ.8,90,108 నగదు డిపాజిట్లు ఉన్నాయి.
- అప్పులు లేకపోగా. తానే లక్ష్మీ నరసింహ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు సుమారు రూ.95 లక్షలు వరకు రుణాలు ఇచ్చారు.
- రూ.1,531 లక్షలు విలువ చేసే 224 గ్రాముల బంగారం, రూ.72 వేలు విలువ చేసే 800 గ్రాముల వెండి ఉంది. అతని ఇద్దరు వారసులకు కూడా ఇదే మొత్తంలో బంగారం, వెండి ఉంది.
- అనకాపల్లి, మాడుగుల ప్రాంతాల్లో ఏడు చోట్ల 4.59 ఎకరాల వ్యవసాయ భూములు, అనకాపల్లిలో 3 ఎకరాల వ్యవసాయేతర భూమి, నగరంలో కంచరపాలెంలో కమర్షియల్ నిర్మాణం, అనకాపల్లి, కంచరపాలెం ప్రాంతాల్లో నివాస సముదాయాలు ఉన్నాయి. ఈ స్థిరాస్తుల మొత్తం విలువ రూ.58,97,53,200.
- కొణతాల వారసులు ఇద్దరికి చెరో రూ.1,13,14,000 స్థిరాస్తులు ఉన్నాయి.
- కొణతాలపై ఎటువంటి కేసులు లేవు.

కన్నబాబు ఆస్తులు రూ.36 కోట్లు

- భార్య రాధాదేవి పేరిట రూ.రూ.14కోట్లు
- ఇద్దరి పేరిట రూ.15కోట్ల అప్పు

యలమంచిలి రూరల్: యలమంచిలి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు) ఆస్తులు రూ.36.72 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. వీటిలో చరాస్తులు సుమారు రూ.16.05 కోట్లు, స్థిరాస్తులు సుమారు రూ.20.67 కోట్లు ఉన్నాయి. భార్య రాధాదేవి పేరిట చర,స్థిరాస్తులు రూ.14.56 కోట్ల ఆస్తులున్నట్టు తెలిపారు. చరాస్తులు సుమారు రూ.6.39 కోట్లు, సుమారు స్థిరాస్తులు రూ.8.17 కోట్లు ఉన్నాయి. ఇద్దరికీ సొంత కారు లేదని తెలిపారు. కన్నబాబు పేరిట రూ.12.21 కోట్లు, భార్య రాధాదేవి పేరిట రూ.3.22 కోట్ల అప్పు ఉందని అఫిడవిట్‌లో పొందుపరిచారు.కన్నబాబుపై క్రిమినల్ కేసులేవీ లేనట్టు పేర్కొన్నారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఎంవీపీకాలనీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు జిలా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సమావేశంలో నిర్ణయాలు ఉంటాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం ఉంటుందని వెల్లడించారు.

దేవదాయ శాఖకు అమ్మవారి నగల అప్పగింత



ఎండోమెంట్ అధికారులకు అమ్మవారి నగలు అప్పగిస్తున్న సన్యాసిపాత్రుడు

ఎండోమెంట్ అధికారులకు అమ్మవారి నగలు అప్పగిస్తున్న సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: స్థానిక శ్రీమరిడమ్మ వారి నగలను శుక్రవారం అమ్మవారి ఆలయంలో దేవదాయశాఖ అధికారులకు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు అందజేశారు. ఎండోమెంట్ ఆభరణాల తనిఖీ అధికారి దుర్గాభవాని, ఈవో గంగారావు, ఆసాది పచ్చగోళ్ల ఈశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ సమక్షంలో నగలు అప్పగించారు. తనిఖీ అధికారి నగలను తూకం వేసి వివరాలను రికార్డుల్లో నమోదు చేశారు. 510 గ్రాముల బంగారు ఆభరణాలు, ఏడున్నర కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఈవో గంగారావు తెలిపారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ రుత్తల లత్సాపాత్రుడు కుటుంబ సభ్యుడైన తాను అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యుడిగా వ్యవహరించేవాడనన్నారు. ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేయడంతో తన దగ్గర ఉన్న అమ్మవారి ఆభరణాలను దేవదాయశాఖ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. నగలు అప్పగింత కార్యక్రమంలో ఏకా శివకుమార్, మామిడి శ్రీను, చిటికెల కన్నబాబు, చింతకాయల వరుణ్ పాల్గొన్నారు.

10 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధం

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో 10 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. హైస్కూల్ సమీపంలో గల డి.శివాజీరాజు, కె.సత్యారావు తదితర రైతులకు చెందిన పొలాల్లో సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ఎంత ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. రెవెన్యూ సిబ్బంది నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా

ఐదేళ్ల సంక్షేమం చూసి ఓటెయ్యండి...



పాములవాక మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం

కోటవురట్ల: అవ్వా ఈ ఐదేళ్లు సీఎం జగన్ మీకు పింఛను డబ్బులు ఎలా అందించారు.. ఈ నెలలో మీకు డబ్బులు అందక ఎంత ఇబ్బంది పడ్డారు..ఒక నెలలోనే చంద్రబాబు బుద్ధిని చూశారు కదా..మళ్లీ ఇటువంటి ఇబ్బంది రాకుండా ఉండాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి.. నీ ఓటుతో పాటు మీ కుటుంబంలోని అందరి ఓట్లు వైఎస్సార్‌సీపీకే వేయాలి..ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి అందరికీ ఆసరాగా ఉండే జగన్‌ను ఇంకోసారి సీఎంగా చేసుకోవాలి.. అంటూ పల్లెల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. వృద్ధులు, మహిళలను కలుసుకుని ఓటు అభ్యర్థించారు. పాములవాకలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీధుల్లో తిరుగుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ ఎన్నికలు చాలా కీలకమని, జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోకపోతే వచ్చే పరిణామాలను వివరిస్తున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారితో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్న కాలంలో సీఎం జగన్ చేపట్టిన చర్యలు ఎన్నో ప్రాణాలను నిలబెట్టాయన్నారు. వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శం కాగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వారిపై అభాండాలు మోపి విమర్శలు చేశారన్నారు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నిటినీ కొనసాగిస్తానంటున్నాడే తప్ప 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు కొత్తగా ఏం చేస్తాడో చెప్పడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మాజీ వలంటీర్లు పాల్గొని రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేయాలని ప్రచారం చేశారు.

రెండో రోజు నామినేషన్లు నిల్

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి రెండో రోజు కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 18నుంచి ప్రారంభమైంది. రెండోరోజైన శుక్రవారం నామినేషన్లు దాఖలు కాలేదని ఆర్‌వో కె.గీతాంజలి తెలిపారు. వైఎస్సార్‌సీపీ కూటమి అభ్యర్థులు ఈనెల 22న నామినేషన్లు దాఖలు చేయడానికి ముహూర్తం నిర్ణయించుకున్నట్టు సమాచారం. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ తరపున కూడా నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

పూడిమడకకు చెందిన వృద్ధుని మృతి

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలోని పూడిమడకకు చెందిన ఎం.అప్పన్న(70) చోడవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో మృతి చెందినట్టు స్థానిక సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఇటీవల సదురు వృద్ధుడు కనిపించడం లేదంటూ అతని కుటుంబీకులు అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు.

పల్లెల్లో ఫ్యాన్ గాలి హోరు

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జోరు



నక్కపల్లి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ప్రచారంలో హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



ఎస్.రాయవరం మండలంలో ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బొలిశెట్టి శారదాకుమారి



నక్కపల్లి : అవ్వాతాతల కష్టాలు తెలుసుకుంటూ ప్రచారం చేస్తున్న కంబాల జోగులు



పాయకరావుపేట పట్టణంలో కాఫీ హోటల్లో దోశలు వేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న కంబాల జోగులు

నక్కపల్లి : పల్లెల్లో ఫ్యాన్‌గాలి హోరెత్తుతోంది. సార్వత్రిక ఎన్నికలప్రచారంలో వైఎస్సార్‌సీపీ జోరుగా దూసుకుపోతోంది. గ్రామాల్లో జగనన్న బలపరచిన అభ్యర్థులకు మహిళాలోకం హారతులిచ్చి నీరాజనం పలుకుతోంది. తప్పెట గుళ్లు, తీన్మార్ డప్పులు, కోలాటాలతో ఘన స్వాగతం పలుకుతున్నారు. యువతీయువకులు, వృద్ధులు, మహిళలు ప్రచారంలో పాల్గొంటూ మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామంటూ ముక్త కంఠంతో నినదిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ జరుగుతున్న ప్రచారంలో గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విశేష ఆదరణ లభిస్తోంది. పార్టీ బలపరచిన అభ్యర్థి కంబాల జోగులు తనదైన శైలిలో ప్రచారంలో ముందంజలో ఉన్నారు. రోజువారి కూలీలు, చిల్లర వ్యాపారస్తులు, ఉపాధి కూలీలు, అవ్వాతాతలు, విద్యార్థులు నిరుద్యోగుల ఇలా అందరితో మమేకమై ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరిస్తూ ఫ్యాన్‌కు ఓటేయాలని కోరారు. అభ్యర్థితో పాటు, గ్రామ మండల స్థాయి నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రచారంలో పాల్గొన్నారు. చంద్రబాబు కుట్రలతో మరింత కసి పెంచుకున్న వలంటీర్లు సైతం తమ పదవులకు రాజీనామా చేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నడుం బిగించారు. అభ్యర్థి కంబాల జోగులకు మద్దతుగా రాజీనామా చేసిన వలంటీర్లంతా ప్రచారంలో దూసుకుపోతున్నారు.

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరి నోటా జగనన్న మాటే వినిపిస్తోందని మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బొలిశెట్టి శారదాకుమారి అన్నారు. తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. దీంతో ఉపాధి కూలీలు తమలాంటి పేద కుటుంబాలకు బ్రోకర్ల బెడద లేకుండా చెప్పిన ప్రతి పథకం అందించారని, ఇళ్ల స్థలం, అమ్మఒడి, చేయూత, రైతు భరోసా అన్నీ వచ్చాయని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే తమకు మంచి జరుగుతుందని బదులిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ కొణతాల ఉమాదేవి, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వార్డు మెంబర్ వియ్యపు సింహాద్రి, కోన దుర్గబాబు పాల్గొన్నారు.



కోనవానిపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శారదాకుమారి

ఉత్సాహంగా ఇంటింటా ప్రచారం



గవర్ల అనకాపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు ఇస్మాయిల్,కోటేశ్వరరావు, వెంకటలక్ష్మి

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. తోటాడలో పార్టీ శ్రేణులు దొడ్డి కోటేశ్వరరావు,షేక్ ఇస్మాయిల్, మళ్ల ఈశ్వరరావు,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి అలాగే మూలపేట పంచాయతీ గంగాదేవిపేటలో ఉప సర్పంచ్ దేవీచంద్రల ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు,.యూవీ రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని అభ్యర్థించారు. వారి వెంట పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మూలపేట ఉప సర్పంచ్ దేవీ చంద్ర ప్రచారం

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి

- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు నామినేషన్‌కు తరలివెళ్లిన నేతలు



ఎమ్మెల్యే రమణమూర్తిరాజు నామినేషన్‌కు తరలివెళుతున్న పార్టీ శ్రేణులు



గోకివాడకు తరలివెళ్లిన కార్యకర్తలు



మల్లవరం నుంచి ర్యాలీగా బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

మునగపాక : యలమంచిలి ఎమ్మెల్యే యువి. రమణమూర్తిరాజు నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ శ్రేణులు శుక్రవారం భారీగా తరలివెళ్లారు. తమ అభిమాన నాయకున్ని గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా కదం తొక్కారు. ఆటోలు,కార్లు,ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లారు. మునగపాకలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు,సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్,పార్టీ నేతలు పిల్లి అప్పారావు,సూరిశెట్టి కన్నారావు,ఆడారి కాశీబాబు,టెక్కలి కొండలరావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

రాంబిల్లి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యువీ రమణమూర్తిరాజు(కన్నబాబు) నామినేషన్ కార్యక్రమానికి రాంబిల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. బైకులు, కార్లు, ఆటోలు ఇతర వాహనాల్లో జనం తరలివెళ్లారు. గ్రామాల్లో ర్యాలీగా వెళ్తూ జై జగన్..జై కన్నబాబు నినాదాలతో హోరెత్తించారు. మండలంలో ప్రతి గ్రామం నుంచి ఉత్సాహంగా కేడర్ నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లడంతో పార్టీలో జోష్ కనిపించింది.

అచ్యుతాపురం : వైఎస్సార్ సీపీ తరపున యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తి రాజు (కన్నబాబు)నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి భారీగా పార్టీ నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లారు.శుక్రవారం యలమంచిలిలో నామినేషన్ వేసిన ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు మద్దతుగా పార్టీశ్రేణులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

29 మంది వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వెంకటనగరం వలంటీర్లు



రాజీనామా పత్రం అందజేస్తున్న పెట్టుగోళ్లపల్లి వలంటీర్లు

పాయకరావుపేట : మండలంలో గల వెంకటనగరం, అరట్లకోట, గోపాలపట్నం గ్రామాలకు చెందిన 29 మంది గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. వెంకటనగరం గ్రామానికి చెందిన 12 మంది గ్రామ వలంటీర్లు, అరట్లకోట గ్రామానికి చెందిన 11 మంది గ్రామ వలంటీర్లు, గోపాలపట్నం గ్రామానికి చెందిన ఆరుగురు గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా వారి రాజీనామా పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.స్వప్నకు అందించారు. తమ విధులకు ఎన్నికల సంఘం ఆటంకం కల్పించిన కారణంగా తామందరం స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పని చేస్తామన్నారు.

ఎస్.రాయవరం : మండలంలో 8 మంది గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. పెట్టుగోళ్లపల్లి గ్రామం నుంచి నలుగురు, గుర్రాజుపేట గ్రామం నుంచి ఇద్దరు, పెనుగొల్లు గ్రామం నుంచి ఇద్దరు రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో సత్యనారాయణకు అందజేశారు. గడిచిన అయిదేళ్లలో జగనన్న పథకాలు ఏ రకంగా అందించామో మళ్లీ మరోమారు జగనన్న సీఎం అయ్యాక అదేవిధంగా అందిస్తామని ప్రతి కుటుంబానికి వివరిస్తామన్నారు.